
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
గురువారం 5 జూన్ 2025



సెంట్రల్ జైలులో మామిడి పండ్ల వేలం

● రూ.64 వేలకు దక్కించుకున్న షేక్ జిలాని

కంది, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలు ఆవరణలోని మామిడి చెట్లకు కాసిన పండ్లకు జైలు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్ బహిరంగ వేలం పాట నిర్వహించారు. సేంద్రియ ఎరువులతో పండించిన మామిడి పండ్లలో దసేరీ, బంగినపల్లి, పెద్దరసాలు, మల్లిక, బేబీషాన్, షాగ వంటి వివిధ రకాల పండ్లు ఉన్నాయి. బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించిన వేలంలో సంగారెడ్డి పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి మామిడి పండ్ల వ్యాపారులు రూ.5 వేలు డిపాజిట్ చేసి పాల్గొన్నారు. వ్యాపారీ షేక్ జిలాని రూ.64 వేలకు పాడి మామిడి పండ్లను దక్కించుకున్నారు.

మోదుగాకుల్లోనే తిందాం

ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగంతో అనారోగ్యం.. పర్యావరణానికి ముప్పు

సిద్దిపేట జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో విస్తర్ల తయారీ

13,650 మంది మహిళలు ఒక్కరోజే తయారు చేసిన 61,500 విస్తర్లు

7

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం





సంగారెడ్డిలోని శాంతినగర్ రేషన్ దుకాణం వద్ద బియ్యం పంపిణీ గురించి లబ్దిదారులతో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



రేషన్ దుకాణాలను పరిశీలించిన నిర్మలా జగ్గారెడ్డి

బియ్యం పంపిణీలో సమస్యలపై లబ్దిదారులను అడిగి తెలుసుకున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ తీరును టీజీఐఐసి చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి ఆరా తీశారు. ఇందులో భాగంగా బుధవారం నాడు సంగారెడ్డిలోని శాంతినగర్ లో ఉన్న రేషన్ దుకాణాన్ని ఆమె సందర్శించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మూడు నెలలకు సరిపోను సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా రేషన్ డీలర్లకు సహకరించి బియ్యం తీసుకోవాలని సూచించారు. నిర్మలా జగ్గారెడ్డి వెంట కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, రేషన్ డీలర్ పూజారి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్‌పై వేటు

● సమాచారం ఇవ్వకుండా సిబ్బందిని దైవ దర్శనానికి తీసుకెళ్లడంపై కలెక్టర్ సీరియస్

● కొత్త కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి గ్రేడ్ వన్ మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌పై బదిలీ వేటు పడింది. ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అనుమతి లేకుండా మున్సిపల్ సిబ్బందిని దైవ దర్శనానికి తీసుకెళ్లడంపై జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సీరియస్ అయ్యారు. ఈ విషయంపై అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ విచారణ జరిపి నివేదిక ఇవ్వడంతో బుధవారం కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌ను మున్సిపల్ ప్రధాన కార్యాలయానికి సరేండర్ చేశారు. సంగారెడ్డి మున్సిపల్ కొత్త కమిషనర్‌గా దుబ్బాక కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా ఉన్న సంగారెడ్డి పట్టణం ఇక కార్పొరేషన్‌గా అవతరిస్తుందనుకున్న ఆశలు కలగానే మారాయి. పట్టణ శివారులోని ఎనిమిది గ్రామాలను విలీనం చేస్తూ మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా ప్రకటించాలని ఇటీవల ప్రతిపాదనలు పంపించగా పక్కన పెట్టేశారు. కనీసం పెరిగిన జనాభా ప్రాతిపదికన వార్డుల సంఖ్యనైనా పెంచాల్సి ఉండగా అది కూడా లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. జిల్లాలోని నూతన మున్సిపాలిటీలైన కోహీర్, గుమ్మడిదల, గడ్డపోతారం, ఇస్నాపూర్‌లకు వార్డుల సంఖ్యను ఖరారు చేస్తూ తాజా నోటిఫికేషన్‌లో ప్రకటించారు.



సంగారెడ్డి పట్టణం

సంగారెడ్డికి సారీ

కార్పొరేషన్ హోదా ఆశలు ఆవిరి

మళ్లీ 38 వార్డులకే మున్సిపాలిటీ పరిమితం

ఓటర్లు పెరిగినా వార్డులు పెంచని వైనం

8 గ్రామాలను కలుపుతూ ప్రతిపాదన పక్కకే

జిల్లాలో 4 కొత్త మున్సిపాలిటీల్లో వార్డులు

ఈ నెల 21వ తేదీ వరకు తుది ప్రక్రియ



సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 4 : రాష్ట్రంలో కొత్త మున్సిపాలిటీలు, పాత మున్సిపాలిటీల్లో జనాభా అంచనా ఆధారంగా వార్డులను పెంచడం, విభజించడం చేపట్టాలని మంగళవారం రోజున పురపాలక శాఖ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ ఇచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్లలోని వార్డుల విభజన సైతం ఇందులో చేర్చారు. గతంలో పంచాయతీలుగా ఉన్న మేజర్ గ్రామాలను మున్సిపాలిటీలుగా మారుస్తున్నట్లు తుది జాబితాలో చేర్చారు. వచ్చే ఎన్నికలను దృష్టితోనే ఈ నోటిఫికేషన్ విడుదలైంది.

ఈ గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలే..

గత మున్సిపల్ ఎన్నికలకు ముందు సంగారెడ్డి మున్సిపాలిటీలో పోతిరెడ్డిపల్లి, చింతల్‌పల్లి, మల్కాపూర్‌లోని కొంతభాగాన్ని విలీనం చేశారు. ప్రస్తుతం ఎన్నికలు జరగాల్సి ఉన్న తరుణంలో సంగారెడ్డిని కార్పొరేషన్‌గా హోదా పెంచాలనే కసరత్తు జరిగింది. సంగారెడ్డి మున్సిపాలిటీలోకి ఫసల్‌వాది, మల్కాపూర్, నాగాపూర్, ఇర్గిపల్లి, కులబ్‌గూరు, చిమ్నాపూర్, కలబ్‌గూరు, కంది గ్రామాలను చేరుస్తున్నట్లుగా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించినట్లు తెలిసింది. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో 1.20 లక్షల జనాభా ఉండగా ఈ గ్రామాల విలీనంతో 2 లక్షల జనాభా దాటనున్నది. ఫలితంగా కార్పొరేషన్ ఏర్పాటుకు మార్గం సుగమమవుతుందని అంతా భావించారు. కానీ సాధ్యపడకపోవడంతో ఈ గ్రామాల్లో మళ్లీ పంచాయతీ ఎన్నికలే జరగనున్నాయి. నిన్నటి దాకా తర్జనభర్జన పడిన ఆశావహులు మళ్లీ పంచాయతీ, స్థానిక ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు.

కొత్త మున్సిపాలిటీల్లో వార్డుల సంఖ్య

మున్సిపాలిటీ	వార్డులు
కోహీర్	16
గుమ్మడిదల	22
గడ్డపోతారం	16
ఇస్నాపూర్	22

ఓటర్లు పెరిగినా 38 వార్డులే..

ప్రస్తుతం సంగారెడ్డి మున్సిపాలిటీలో 38 వార్డులు ఉన్నాయి. వార్డుల నుంచి కౌన్సిలర్లు గెలుపొంది తమలో ఒకరిని రిజర్వేషన్ ఆధారంగా చైర్మన్‌ను ఎన్నుకుంటున్నారు. అయితే, ఈసారి వార్డులకు బదులుగా కార్పొరేషన్ డివిజన్లు ఏర్పాటు చేస్తారని అనుకున్నప్పటికీ అది సాధ్యపడలేదు. జనాభా పెరగడంతో కనీసం 45 నుంచి 50 మున్సిపల్ వార్డులకు పెంచుతారనే అంచనా ఉండేది. అయితే, తాజా నోటిఫికేషన్‌లో సంగారెడ్డిలో వార్డుల పెంపు ఊసెత్తలేదు. పారిశ్రామికంగా, పాలనపరంగా, రియల్ ఎస్టేట్ నేపథ్యంలో సంగారెడ్డిలో విపరీతమైన

మిగతా 8వ పేజీలో

గ్రేటర్‌లోకి మూడు మున్సిపాలిటీలు

తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం, అమీన్‌పూర్‌లు జీహెచ్ఎంసీలోకి

ఐడీఏ బొల్లారం జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న మూడు మున్సిపాలిటీలు జీహెచ్ఎంసీలో చేరనున్నాయి. అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం గ్రేటర్ పరిధిలోకి రానున్నాయి. జిల్లాలో 12 మున్సిపాలిటీలు ఉండగా అందులో నాలిగింటిని కొత్తగా ఏర్పాటు చేశారు. కొత్త వాటిల్లో తాజాగా వార్డుల విభజనకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఔటర్ బయట ఉన్న వాటిలోనే వార్డుల విభజన చేపట్టగా, లోపల ఉన్న ఐడీఏబొల్లారం, అమీన్‌పూర్, తెల్లాపూర్ పురపాలికల్లో ఎటువంటి కసరత్తు చేయరాదంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు హైదరాబాద్ చుట్టుపక్కల, ఔటర్ లోపల ఉన్న అన్ని పురపాలక సంఘాలను మినహాయిస్తూ పురపాలకశాఖ ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఫలితంగా తెల్లాపూర్ మున్సిపాలిటీలో కలిపిన ముత్తంగి, కర్దనూరు, పాటి, ఘన్‌పూర్, పోచారం గ్రామాలు సైతం గ్రేటర్‌లోనే ఉంటాయి.



జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరిక



గవ్వలపల్లిలో ఫర్టిలైజర్ షాపులో విత్తనాల బ్యాగులను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

చిన్నశంకరంపేట జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేస్తామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. బుధవారం చిన్నశంకరంపేట మండలంలోని గవ్వలపల్లి ఫర్టిలైజర్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విత్తనాల కొనుగోలుపై రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీలర్లు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచి రైతులకు విక్రయించాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా రశీదును పొందాలన్నారు. అనంతరం షాపులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే, సిమెంట్‌షాపులు సందర్శించి బ్యాగు ధరలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మార్పీ రేట్ల కంటే అధికంగా అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మన్నన్, మండల వ్యవసాయ అధికారి లక్ష్మీప్రవీణ్, ఆర్ఐ రాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు

భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మండలంలోని కొరివిపల్లి, చందాపూర్ గ్రామాల్లో రెండో రోజైన బుధవారం భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కలెక్టర్ పాల్గొని, రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించారు. భూ సమస్యలపై రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పైలెట్ మండలం చిలిపిచెడు నుంచి రెవెన్యూ సదస్సుల నిర్వహించడం ప్రారంభించామన్నారు. కొన్నేళ్ల నుంచి సతమతమవుతున్న భూ సమస్యలను ఈ సదస్సులో పరిష్కరించుకోవాలని సూచించారు. రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తుమని తెలిపారు.

రేషన్ బియ్యం పంపిణీలో ఆలస్యంపై ఆందోళన వద్దు : కలెక్టర్

వర్షాకాలం నేపథ్యంలో వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నదని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. పంపిణీలో తలెత్తే ఇబ్బందులతో ఆలస్యమవుతుందని, కార్డుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆయన బుధవారం చిన్నశంకరంపేటలోని రేషన్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ డీలర్లు వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా బియ్యాన్ని సరఫరా చేయాలని సూచించారు. రేషన్ బియ్యం సరఫరా డిజిటల్ రిసీప్ట్‌ను పరిశీలించి, డీలర్లకు పలు సూచనలు అందజేశారు. కార్డుదారులతో కలెక్టర్ ముచ్చటించారు. ఆయన వెంట తహసీల్దార్ మన్నన్, ఆర్ఐ రాజు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

నారాయణఖేడ్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం నారాయణఖేడ్ నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 11న పౌర్ణమిని పురస్కరించుకుని 9న సాయంత్రం నారాయణఖేడ్ నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలానికి 11న ఉదయం చేరుకుంటాయన్నారు. అలాగే 12న ఉదయం జోగులాంబ అమ్మవారి దర్శనం అనంతరం 4 గంటలకు బయలు దేరి నారాయణఖేడ్‌కు చేరుకుంటాయని తెలిపారు. ఇందుకు సంబంధించి రానుపోను చార్జీల కింద రూ.4500 చెల్లించి టికెట్లు బుక్ చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం 9959223170, 9441071134, 9676667703 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

బీబీపేటలో చిరుత సంచారంతో భయం భయం

కల్హేర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సంచరిస్తున్న చిరుత పులి తాజాగా బీబీపేటలోకి ప్రవేశించడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం రాత్రి చిరుతపులి గ్రామానికి చెందిన జుమ్మ బీరు గొండ పొలంలో కట్టేసిన ఆవు, లేగ దూడను చంపి తినడంతో ఇక్కడి వారు బెంబెలెత్తిపోతున్నారు. ఇప్పటివరకు మండలంలోని కడ్పల్, ఖాజాపూర్, క్రిష్టాపూర్, నాగ్‌ధర్ శివారుల్లోనే సంచరించిన చిరుత మొదటిసారిగా బీబీపేట గ్రామ శివారుకు చేరుకున్నది. చిరుత దాడి విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియపర్చగా బీట్ అధికారి కృష్ణ బుధవారం ఘటన స్థలాన్ని పరిశీలించారు.

బ్రెయిడెడ్ వ్యక్తి అవయవాలు దానం



పార్థసారథి

సంగారెడ్డి రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల క్రితం జిన్నారం మండలం ఊట్ల గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన పార్థసారధి బ్రెయిన్ డెడ్ అయ్యారు. మేడ్చల్ జిల్లా సూరారంలోని మల్లారెడ్డి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పార్థసారథి కుటుంబ సభ్యులు ఆయన అవయవాలను దానం చేశారు. పార్థసారధి కుటుంబసభ్యులను ఆసుపత్రి యాజమాన్యం అభినందించింది.



దత్తాత్రేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి

ప్రతిష్ఠాపనోత్సవంలో మాజీ మంత్రి హరీశ్‌రావు

శివ్వంపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూడూరులో శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజి మహారాజ్ ఆశీస్సులతో గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వ్యవస్థాపకులు పెద్దగొని రమాదేవి, శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో వేద పండితులు వామన శర్మ సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజైన బుధవారం ఉత్సవాలలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ పాల్గొన్నారు. ఇటీవల మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి తండ్రి రిటైర్డ్ హెచ్ఎం నరసింహారెడ్డి మృతిచెందడంతో బుధవారం వారి కుటుంబాన్ని అనంతరం, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి పరామర్శించారు.

ఆస్పత్రుల్లో డైట్ నిర్వహణ.. ఇక మహిళా సంఘాలకే !

మెస్ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం

టెండర్లు లేవు, కాంట్రాక్టర్ వ్యవస్థ ఉండదు

కలెక్టర్‌కు ఫైల్ పంపిన సూపరింటెండెంట్లు

వచ్చే నెల నుంచే శ్రీకారం



సంగారెడ్డిలోని జీజీహెచ్‌లో రోగులకు అందిస్తున్న భోజనం(ఫైల్)

సంగారెడ్డి అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన నాటి నుంచి మహిళలు ఆర్థిక సాధికారత సాధించేలా పలు సంస్కరణ అమలు చేస్తూ వస్తున్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పథకాలలో వారికి ప్రాధాన్యతనిస్తున్నారు. ఇందులో భాగంగానే సర్కారు ఆస్పత్రుల్లో ఆరు నెలల కిందటనే ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌లను ఏర్పాటు చేసి ఆ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించారు. తాజాగా రోగులకు అందించే డైట్ నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకే అప్పగించాలని సర్కారు తాజాగా నిర్ణయం తీసుకున్నది. దీంతో ఈ దిశగా అడుగులు పడుతున్నాయి.

జిల్లాలో పది ఆస్పత్రులు

సంగారెడ్డి జిల్లాలో పది సర్కారు దవాఖానాలున్నాయి. డీఎంఈ పరిధిలో

మిగతా 8వ పేజీలో

ఇటీవలే విజిలెన్స్ రిపోర్టు ఆధారంగా షోకాజ్‌లు

సంగారెడ్డి జిల్లాలో టీవీవీపీ పరిధిలోని నాలుగు ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు గత నెల 30వ తేదీన వైద్య ఆరోగ్య శాఖ షోకాజ్ నోటీసులను జారీ చేసింది. ఆస్పత్రుల్లో రోగుల భోజనం విషయంలో నిర్లక్ష్యం జరుగుతుందని, మెను, నాణ్యతతో పాటు పరిశుభ్రత పాటించడం లేదంటూ సర్కారుకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం జహీరాబాద్, నారాయణఖేడ్, పటాన్‌చెరు, జోగిపేట ఏరియా ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అంతే కాకుండా ఆస్పత్రుల కాంట్రాక్టర్లను తొలగించి, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆదేశించింది.

ఈసారీ దాటవెతలే!

ఝరాసంగం మండలంలో ప్యాలవరం బ్రిడ్జి పనులు ఇంకెన్నాళ్లు ?

ఆరు నెలల క్రితం శంకుస్థాపన..

వర్షాకాలంలోపు పూర్తి చేస్తామని హామీ

7



అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన గుడ్లు

7

నిర్లక్ష్యంపై హత్నూర మండలం మాధుర ప్రజలు ఆగ్రహం



ముప్పిరెడ్డిపల్లిలో గంజాయి పట్టివేత

● నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టును చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మనోహరాబాద్ జూన్ 4(ఆంధ్రజ్యోతి): ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో ఎండు గంజాయి పట్టుకున్న ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ముప్పిరెడ్డిపల్లిలో ఎండు గంజాయి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు నర్సాపూర్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నివాసముంటున్న బీహార్‌కు చెందిన ఆదియ రాజు అనే వ్యక్తి ఇంట్లో తనిఖీ చేయగా 221 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ మాదక ద్రవ్యాల చట్టం ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసి, మెదక్ కోర్టులో బుధవారం హాజరుపరిచారు. దాడిలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గులాం ముస్తఫా, ఎస్ఐ ఖాజా అజీజ్ అహ్మద్, హెడ్ కానిస్టేబుల్ అబిద్ హుస్సేన్, అనిల్, రామకృష్ణ, సందీప్ పాల్గొన్నారు. ఎలాంటి సమాచారం ఉన్నా తమకు తెలపాలని పేర్కొన్నారు.

రెండు బైకులు ఢీ.. ఒకరు మృతి



దామోదర్‌రెడ్డి(ఫైల్)

నర్సాపూర్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్-వెల్దుర్తి ప్రధాన రోడ్డుపై మండలంలోని లింగాపూర్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన నాయిని దామోదర్‌రెడ్డి(70) నర్సాపూర్ నుంచి పిల్లుట్లకు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా ఢీకొనడంతో కింద పడి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పై ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. మృతుడు బీఆర్‌ఎస్‌లో ముఖ్య నాయకుడిగా, మాజీ ఉపసర్పంచ్‌గా పనిచేశాడు.

మంజీరాలో దూకి వివాహిత ఆత్మహత్య

మనూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మంజీరానదిలో దూకి ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా మనూరు మండలం రాయిపల్లిలో బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శశికళ(46) కుటుంబ సభ్యులతో తగాదాలు రావడంతో బుధవారం ఉదయం మంజీరాలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. ఈ సమాచారమందుకున్న మనూరు ఎస్ఐ శంకరయ్య హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి శవాన్ని మంజీరాలోంచి బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త గతంలోనే చనిపోగా ఇద్దరు కుమార్తెలు ఉన్నారని గ్రామస్థులు వివరించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు మనూరు ఎస్ఐ శంకరయ్య తెలిపారు.

గుండెపోటుతో ఆర్‌ఎంపీ వైద్యుడు మృతి



బైద్య అనంతకుమార్(ఫైల్)

నాగల్‌గిద్ద, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఆర్‌ఎంపీ వైద్యుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఇరక్‌పల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు చెందిన బైద్య అనంత్‌కుమార్(45) ఇరక్‌పల్లి గ్రామంలో సుమారు 20 సంవత్సరాల నుంచి ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ ఆర్‌ఎంపీ వైద్యుడిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం ఇంట్లో నుంచి బయటికి రాక పోవడంతో ఇంటి యజమాని వడ్ల చంద్రశేఖర్ కిటికీల నుంచి చూడగా విగతజీవిగా కింద పడి ఉన్నాడన్నారు. పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ బి.సాయిలు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మోదుగాకుల్లోనే తిందాం

ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగంతో అనారోగ్యం.. పర్యావరణానికి ముప్పు

● సిద్దిపేట జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో విస్తర్ల తయారీ
● ఒక్కరోజే 13,650 మంది మహిళలతో 61,500 తయారీ
● తయారీ యూనిట్‌కూ సన్నాహాలు!

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



మోదుగు విస్తర్లతో మహిళలు

సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నేటి కంప్యూటర్ యుగంలో మానవుడు ప్రకృతి 'ప్రసాదా'లకు క్రమంగా దూరమవుతున్నాడు. భూతల్లి అందించే సహజ వనరులను అందిపుచ్చుకునే అవకాశం లేక పర్యావరణ సమతుల్యతను దెబ్బతీసే ప్లాస్టిక్ భూతాన్ని ఆశ్రయిస్తూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నాడు. ఈ రోజుల్లో ఏ ఫంక్షన్‌లోనైనా భోజనాలంటే గుర్తొచ్చేది ప్లాస్టిక్‌తో తయారు చేసే పేపర్ ప్లేట్లే. వీటిలో తింటే తీవ్రమైన ఆరోగ్య సమస్యలొస్తాయని తెలిసినా ప్రత్యామ్నాయం లేకపోవడంతో తప్పడంలేదు. వీటివల్ల పర్యావరణానికి కూడా తీవ్రమైన ముప్పు ఏర్పడుతుంది. ఒకప్పుడు పొలం దగ్గర విరివిగా దొరికే మోదుగు ఆకులను సేకరించి ఇంటివద్ద కూర్చొని ముచ్చట్లు పెట్టుకుంటూ విస్తర్లు కుట్టేవారు. అలాంటిది ఇప్పుడు యాంత్రిక జీవనంలోకి రెడీమేడ్‌గా రంగురంగులతో తయారు చేసిన ప్లాస్టిక్ విస్తర్లే దిక్కుగా మారాయి. వనభోజనాలకు వెళ్లినా ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులనే తీసుకెళ్లి వినియోగిస్తున్నారు. ఇందులో వేడివేడి మటన్, చికెన్ కర్రీలు వేసుకొని భోజనం చేయడం వల్ల అందులో రసాయనాలు కరిగి పాలిథిన్ పదార్థం మనిషి శరీరంలోకి చేరుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో వివిధ రకాల వ్యాధుల బారిన పడడంతో పాటు కేన్సర్‌కు దారితీస్తుందని వారు హెచ్చరిస్తున్నారు.



విస్తర్ల తయారీకి శ్రీకారం..

ప్లాస్టిక్ ప్లేటకు ప్రత్యామ్నాయంగా జిల్లా పంచాయతీ శాఖ అధికారి దేవకి దేవి ఆధ్వర్యంలో కలెక్టర్ మను చౌదరి ఆదేశాల మేరకు మోదుగు ఆకులతో విస్తర్ల తయారీకి శ్రీకారం చుట్టారు. మహిళా సంఘాలు, యువకులు, యువతులకు అవగాహన కల్పించి తయారు చేయిస్తున్నారు. పర్యావరణానికి మేలు చేయడంతో పాటు మోదుగాకు విస్తర్ల తయారీతో ఉపాధి కూడా ఉంటుందని మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో మోదుగు విస్తర్ల యూనిట్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజే 13,650 మంది మహిళలు 61,500 మోదుగు ఆకు విస్తర్లు తయారు తయారుచేసి రికార్డు సృష్టించారు. మోదుగు ఆకులతో తయారుచేసిన విస్తరాకులను కలెక్టర్ మను చౌదరికి జిల్లా పంచాయతీ శాఖ అధికారి దేవకీ దేవి అందజేశారు.

ప్రజలు ప్లాస్టిక్‌ను వాడొద్దు..



పరిశుభ్రమైన ప్రకృతి కోసం ప్లాస్టిక్‌కు గుడ్‌బై చెప్పండి. ప్రజలు ప్లాస్టిక్ వాడితే ఆరోగ్య సమస్యలు వస్తాయి. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి. జిల్లాను ప్లాస్టిక్ రహిత మర్చేందు అందరు కృషి చేమాలి. ఇండ్లల్లో ఫంక్షన్ అయినా మోదుగు ఆకులతో తయారుచేసిన విస్తరాకులను వాడుకోవాలి.

-సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి

పాత రోజులు రావాలి



జిల్లాను ప్లాస్టిక్ రహితగా మార్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. మహిళలకు, యువకులకు మోదుగు ఆకులతో విస్తరాకుల తయారీ పై అవగాహన కల్పిస్తున్నాం. విస్తరాకుల తయారీ చేస్తే పర్యావరణానికి మేలు చేయడంతో పాటు వారికి ఉపాధి కూడా ఉంటుంది. గతంలో ఏ ఫంక్షన్ అయినా మనము మోదుగు ఆకులతో తయారుచేసిన విస్తరాకులను వాడుకునే వాళ్ళం. మళ్లీ ఆ పాత రోజులు రావాలని ఆశిస్తున్నాం

-దేవకీదేవి, జిల్లా పంచాయతీశాఖ అధికారి

పర్యావరణాన్ని రక్షిద్దాం

హుస్నాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : భూమిపై ఉన్న జీవరాసులు, జనజీవనం సక్రమంగా సాగిపోవాలంటే వాతావరణ పరిస్థితులు సక్రమంగా ఉండాలి. ఇప్పటికే పర్యావరణ పరిరక్షణను పట్టించుకోక పోవడంతో అనేక విపత్కర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అడవులు అంతరించి పోవడం, ప్లాస్టిక్ వాడకం, గుట్టలను ధ్వంసం చేయడంతో అతివృష్టి అనావృష్టి సంభవిస్తున్నాయి. పర్యావరణాన్ని పెంపొందించుకునేందుకు విరివిగా మొక్కలు నాటి పెంచాలి. వాటర్ షెడ్లను నిర్మించడంతోపాటు చెరువులు, కుంటలు, సరస్సుల పూడిక తీస్తూ ఉండాలి. ప్లాసిక్‌కు బదులుగా పేపర్, జ్యూట్, కాటన్ సంచులను వినియోగించాలి. బంజెరు భూములను అభివృద్ధి చేసుకోవాలి,

సిద్దిపేట జిల్లాలో అడవి 6.4శాతమే...

సిద్దిపేట జిల్లాలో 6.4శాతం (23,336 హెక్టార్లు) అటవీ భూమి మాత్రమే ఉంది. జాతీయ అటవీ విధానం ప్రకారం 33శాతం ఉండాలి. అలాగే హుస్నాబాద్ డివిజన్‌లోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, మద్దూర్, చేర్యాల, బెజ్జంకి మండలాల్లో 3,900 హెక్టార్లలో రిజర్వ్ ఫారెస్ట్ ఉండగా ఇది 5 నుంచి 10 శాతం మాత్రమే.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఐఐఎంఆర్ ప్రిన్సిపల్ సైంటిస్టు డా.అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న ఐఐఎంఆర్ ప్రిన్సిపల్ సైంటిస్టు డా.అరుణ

జహీరాబాద్, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : రైతుల ప్రయోజనార్థం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రిసెర్చ్ సెంటిస్టు డా.అరుణ, జిల్లా నోడల్ అధికారి వరప్రసాద్, వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని హుగ్గెల్లి, బాబానగర్ తదితర ప్రాంతాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న వారు మాట్లాడుతూ చిరుధాన్యాలసాగు, ప్యాకేజీ, ఉత్పత్తిదారులు అమ్ముకునే విధానాలు, తదితరాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏవో లావణ్య, ఉద్యానశాఖ అధికారి పండరి, శాస్త్రవేత్తలు శైలజ, స్నేహలత, సాయిప్రియాంక, కైలాష్ తదితరులు మాట్లాడుతూ వివిధరకాల పంటలసాగుపై అవగాహన కల్పించారు. రైతులకు ఎలాంటి సందేహాలున్నా శాస్త్రవేత్తల, అధికారులను స్పందించి వారిచ్చిన సలహాలు సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు 35 మంది గైర్హాజరు

సంగారెడ్డి అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో జరిగిన ద్వితీయ భాష పరీక్షకు 40 మందికి 5 మంది హాజరుకాగా 35 మంది గైర్హాజరయ్యారని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

గీతం అధ్యాపకురాలికి పీహెచ్‌డీ

పటాన్‌చెరు రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఝాన్సీ రాణి తిరుమలశెట్టికి పీహెచ్‌డీ లభించింది. హైదరాబాదులోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ విశ్వవిద్యాలయం (జేఎన్ టీయూహెచ్) నుంచి సీఎస్ఈలో ఆమె పీహెచ్‌డీని పొందారు. జేఎన్ టీయూ 13వ స్నాతకోత్సవంలో ఉప కులపతి ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్‌రెడ్డి ఝాన్సీకి పీహచ్‌డీ పట్టాను అందజేశారు. ఆమెను గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, ఆయా విభాగాల అధిపతులు, డైరెక్టర్లు అభినందించారు.

గెజిటెడ్ హోదా కల్పించండి

● మంత్రికి పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగుల వినతి



మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు

సంగారెడ్డి రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సూపరింటెండెంట్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఉద్యోగులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సూర్యకాంత్, రఘు, సంఘం నాయకులు సుభాష్, వెంకన్న, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన గుడ్లు



మాధుర అంగన్‌వాడీ కేంద్రంలో సరఫరా చేసిన కుళ్లిన గుడ్లు

హత్నూర, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం సరఫరా చేసిన కోడిగుడ్లు పూర్తిగా కుళ్లిపోయి రావడంతో వాటిని ఎలా తినాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఓ వైపు అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తూ చిన్నారులు, బాలింతల ఆరోగ్య పరిస్థితులను మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకుంటే.. ఇక్కడ మాత్రం పాడైన గుడ్లు సరఫరా చేస్తూ వాటిని తినకుండా చేస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ లోపంతో కుళ్లిన గుడ్లు తరుచూ సరఫరా చేస్తుండటంతో అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందిపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హత్నూర మండలం మాధుర గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన గుడ్లు పూర్తిగా కుళ్లిపోయి ఉండడంతో ఇండ్లలోకి తీసుకెళ్లిన ప్రజలు వాటిని చూసి ఒక్కసారిగా ఆశ్చర్యానికి లోనయ్యారు. తరుచూ అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన గుడ్లు సరఫరా చేస్తున్నారని, వాటిని గమనించకుండా తింటే జరిగే పరిణామాలకు ఎవరు బాధ్యులని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గుడ్ల సరఫరాపై పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అక్కడక్కడ అంగన్‌వాడీ కేంద్రాలకు ఇలాంటి గుడ్లు సరఫరా అవుతున్నాయని ఆరోపిస్తున్నారు. 20 రోజుల గుడ్లను ఒకేసారి ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా కుళ్లిపోయిన గుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేణుకా ఎల్లమ్మకు సీపీఐ నేత చాడ పూజలు

హుస్నాబాద్ టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ దేవిని బుధవారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సుగుణ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఇఓ కిషన్‌రావు చాడ వెంకటరెడ్డి దంపతులను శాలువాతో సన్మానించారు. ఇందులో రేకొండ సింగిల్ విండో డైరెక్టర్ చాడ శ్రీధర్, ఆలయ అర్చకులు పరమేశ్వర్ తదితరులున్నారు.



చాడను సన్మానిస్తున్న ఆలయ ఈఓ కిషన్‌రావు



10 రోజుల క్రితం కురిసిన వర్షానికి పొంగిపొర్లుతున్న వాగును దాటలేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఈసారీ దాటవెతలే

● నిర్మాణానికి నోచుకోని ప్యాలవరం బ్రిడ్జి
● రూ. 3కోట్లతో ఆరు నెలల క్రితం శంకుస్థాపన
● వర్షకాలంలోపు పూర్తి చేస్తామని హామీ
● ఇప్పటికీ ప్రారంభంకాని పనులు
● వాగోస్తే రాకపోకలు తీవ్ర ఇబ్బందులు



బ్రిడ్జి నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్ (ఫైల్)

ఝరాసంగం, జూన్4(ఆంధ్రజ్యోతి) : ఝరాసంగం మండల పరిధిలోని ప్యాలవరం వాగు ఏటా వానకాలంలో పొంగిపొర్లుతుండడంతో గ్రామస్థులు రాకపోకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలల క్రితం ఈ వాగు పై నూతనంగా బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయి. అంతేకాకుండా జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పనులకు శంకుస్థాపన కూడా చేశారు. రానున్న వానకాలంలోపు బ్రిడ్జి నిర్మాణాని పూర్తి చేస్తామని వారు అప్పట్లో ప్రజలకు భరోసా ఇచ్చారు. దీంతో ఎన్నో ఏళ్ల అవస్థలకు చెక్ పడుతుందని గ్రామస్థులు భావించారు. కానీ ఇప్పటికీ పనులు ప్రారంభంకాకపోవడంతో ఈ సారీ కూడా ఇక్కట్లు తప్పడం లేదు. 10 రోజుల క్రితం కురిసిన వర్షానికి వాగు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించి ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు.

రాకపోకలకు తప్పని ఇబ్బందులు

ఎన్నో సంవత్సరాల నుంచి ప్యాలవరం వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో ఆ గ్రామ ప్రజలు వర్ష కాలం వచ్చిందంటే నానా తంటాలు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా ఈ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా పనులు వేగవంతంగా చేస్తుందనుకుంటే.. కాలయాపనకే పరిమితమైందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ముఖ్యంగా ప్యాలవరం, దేవరంపల్లి గ్రామానికి రాకపోకలు సాఫీగా సాగుతాయి.

ప్రతీ ఏటా తిప్పలే..



ఏటా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకుకు ఇబ్బందులు పడుతున్నాం. నీళ్ల తగ్గుముఖం పట్టేంతవరకు నిరీక్షిణ తప్పడంలేదు. తప్పని పరిస్థితిల్లో దేవరంపల్లి మీదుగా చుట్టూ తిరిగి జహీరాబాద్ పట్టణానికి వెళ్లాల్సి వస్తుంది.

-మాణిక్యం యాదవ్, ప్యాలవరం

స్థిర ప్రణాళికలతో ఐఐటీల్లో చేరండి

● ఇంజనీరింగ్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఉండాలి
● ఉద్యోగాలను సృష్టించే స్థాయిలో ఆలోచనలు చేయాలి
● జేఈఈ ఓపెన్ డేలో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి



మాట్లాడుతున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

కంది, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలని ఐఐటీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) డైరెక్టర్ బీఎస్ మూర్తి అన్నారు. స్థిరమైన ప్రణాళికలతో ఐఐటీలలో చేరాలని, ఐఐటీ విద్యార్థులంటే ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయిలో ఆలోచనలు చేయాలన్నారు. జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ (జేఈఈ)లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీల్లో సీటు పొందాలని ఆశించే విద్యార్థులకు సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో బుధవారం జేఈఈ ఓపెన్ డే-2025 కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర నలుమూలల నుంచి వందలాది మంది జేఈఈ ర్యాంకర్లు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎస్ మూర్తి.. ఐఐటీలో ఎందుకు చదవాలి, ప్లేస్‌మెంట్స్ ఎలా ఉంటాయి, ఇంటర్న్‌షిప్‌లు, వినూత్న అవకాశాలు, ఆవిష్కరణలు, సాంకేతికతలపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. వినూత్న విద్యా విధానం. అత్యాధునిక పరిశోధనలు, పర్యావరణం, ఐఐటీహెచ్ విద్యార్థులు సాధించిన విజయాలు, ఆవిష్కరణలు, నూతన పరిశోధనలు తదితరాల గురించి వివరించారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి ఐఐటీహెచ్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ విధానంలోనూ ఇదే సెషన్‌ను నిర్వహించనున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



శంకర్‌నాయక్ (ఫైల్)

కౌడిపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు బోరు మోటారును ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై చనిపోయాడు. ఈ ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని బుజరంపేట పీర్యాతండాలో బుధవారం జరిగింది. రైతు నేనావత్ శంకర్‌నాయక్(48) పొలంలో ఉన్న బోరు మోటర్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబీకులు వెంటనే కౌడిపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయినప్పటికీ ఫలితం లేక పోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే, అప్పటికే చనిపోయినట్లు వైద్యు తెలిపారు.

హుస్నాబాద్‌లో రైతు మహోత్సవం

● 6 నుంచి మూడు రోజులపాటు నిర్వహణ
● ప్రారంభించనున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
● హాజరుకానున్న మంత్రులు ఉత్తమ్, పొన్నం, కొండా
● నియోజకవర్గం నుంచి 5వేల మంది రైతులను తరలించేందుకు 100 బస్సులు సిద్ధం
● వ్యవసాయ రంగానికి సంబంధించిన 108 స్టాళ్లు

వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన స్టాళ్లు



హుస్నాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 6,7,8 తేదీల్లో హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తెలంగాణ రైతు మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ హాజరుకానున్నారు. మొదటి రోజు హుస్నాబాద్ నియోజకవర్గంలోని 5వేల మంది రైతులను 100 బస్సుల ద్వారా తరలించనున్నారు. రెండవ రోజు సిద్దిపేట, చేర్యాల డివిజన్‌కు చెందిన 3000, మూడవ రోజు ములుగు, గజ్వేల్, దుబ్బాకకు 3000 మంది రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన, ముఖాముఖి, వర్క్‌షాప్‌లను నిర్వహించనున్నారు. రైతులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖ విభాగాలు, విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, ఎఫ్‌పీవోలు, స్టార్టప్ కంపెనీలు, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రైవేట్ కంపెనీలకు చెందిన 108 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంర్థక, మత్స్య శాఖకు చెందిన 15 మంది శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, అవార్డు గ్రహీత రైతులు, అభ్యుదయ రైతులతో అవగాహన, ముఖాముఖీ కార్యక్రమాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు.

ఏర్పాట్లలో అధికారులు..

రైతు మహోత్సవానికి ఇంకా ఒక్క రోజే మాత్రమే ఉండటంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే జర్మని టెంట్లతో స్టాళ్లు ఏర్పాటు చేశారు. దాదాపు 5 వేల మంది కూర్చుండే విధంగా హాల్, అందులోనే వేదికను ఏర్పాటు చేస్తున్నారు. బోజనం చేసేందుకు ప్రత్యేకంగా టెంట్లు వేస్తున్నారు. రైతులను బస్సుల్లో తీసుకువచ్చి, తిరిగి గ్రామాల్లో దించనున్నారు. ఏర్పాట్లను జిల్లా వ్యవసాయ అధికారి రాధిక బుధవారం పర్యవేక్షించారు. మార్కెట్ యార్డును ఏసీపీ సదానందం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆధునిక వ్యవసాయంపై పరిజ్ఞానం పెంచేందుకే..

అత్యాధునిక వ్యవసాయంపై రైతులకు పరిజ్ఞానం పెంచేందుకు ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి రాధిక తెలిపారు. కొత్తగా వచ్చిన విత్తనాలు, రైతులు ఇప్పటివరకు వినియోగించని పనిముట్లు వంటివి ఇందులో ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రాధిక

న్యూస్ బాక్స్

పోలీసులు అక్రమంగా కేసులు బనాయిస్తున్నారు

చేగుంట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలం చిట్టోజిపల్లి గ్రామ శివారులోని 266/1 సర్వే నంబర్లలో భూములు అమ్మలేదని, ఎవరి దగ్గర డబ్బులు తీసుకోలేదని ఇబ్రహీంపూర్ వేంకటేశ్వర ఆలయ ధర్మకర్త పోచంపల్లి (గోల్కొండ) కిషన్‌రావు పేర్కొన్నారు. బుధవారం చేగుంటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 266/1లో 320 ఎకరాల భూమి ఇబ్రహీంపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిందని తెలిపారు. ప్రతీ సంవత్సరం గ్రామంలో గోల్కొండ కృష్ణవేణి, పోచంపల్లి (గోల్కొండ) కిషన్‌రావు ఆలయ ధర్మకర్తలుగా ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆ భూమికి సంబంధించి కొంతమంది తమను పోలీసుల ద్వారా ఇబ్బందుల గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆ గ్రామంలో ఎలాంటి భూ విక్రయాలు జరగలేదన్నారు. 266/1 భూమికి సంబంధం లేని వ్యక్తులతో కుమ్మక్కై పోలీస్‌శాఖ సంబంధించిన కొంత మంది తమను ఇబ్బందులకు గురిచేస్తూ కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పెద్దశంకరంపేట ఎస్సైగా ప్రవీణ్‌రెడ్డి


ప్రవీణ్‌రెడ్డి

పెద్దశంకరంపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట ఎస్సైగా ప్రవీణ్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్‌ఐగా పనిచేసిన శంకర్ అల్లాదుర్గం మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు ఇబ్బందులు కలుగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు.

అల్లాదుర్గం ఎస్సైగా శంకర్


శంకర్

అల్లాదుర్గం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం ఎస్సైగా డి.శంకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన ప్రవీణ్‌రెడ్డి పెద్దశంకరంపేట ఎస్సైగా బదిలీకావడంతో ఆయన స్థానంలో ప్రభుత్వం పెద్దశంకరంపేట పోలీ‌సస్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న శంకర్‌ను ఇక్కడికి బదిలీ చేసింది.

బీజేపీ నాయకుల పూజలు

మనోహరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఎంపీగా గెలిచి సంవత్సరం పూర్తికావడంతో మనోహరాబాద్ మండలం కాళ్లకల్ బంగారమ్మతల్లి ఆలయంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పురం మహేష్, మండలాధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి ఇన్‌చార్జిగా యాదగిరి

మాసాయిపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జిగా మెదక్ జిల్లా సీనియర్ నాయకుడు, మాసాయిపేటకు చెందిన యాదగిరిమాదిగను నియమిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన మందకృష్ణమాదిగకు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

మునిపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మునిపల్లి ఎస్ఐ రాజేష్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కంకోల్‌లో సైబర్ నేరాలు, డయల్ 100 తదితర అంశాలపై వివరించారు.

అంతరాలు లేని సమాజమే సీపీఐ లక్ష్యం : పవన్

గజ్వేల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అంతరాలు లేని సమాజమే సీపీఐ లక్ష్యమని సిద్దిపేట సీపీఐ కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ గజ్వేల్ మండల 17వ మహాసభ సందర్భంగా గజ్వేల్ పట్టణంలో ఇందిరచౌక్ నుంచి అంబేద్కర్ విగ్రహం గుండా కోలా అభిరామ్ గార్డెన్ వరకు పార్టీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ సీనియర్ నాయకులు బట్టు దయానందరెడ్డి గారు సీపీఐ పతాక ఆవిష్కరణ చేసి మహాసభలను ప్రారంభించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ హాజరై మాట్లాడారు.

పట్టాలు పునరుద్ధరించాలని వినతి

చేర్యాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో గతంలో దళితులకు కేటాయించిన పట్టాభూములను పునరుద్ధరించాలని కోరుతూ సీపీఐ నాయకులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించగా, సీపీఐ జిల్లా కౌన్సిల్ మెంబర్ అందె అశోక్ తదితరులు అధికారులకు వినతిపత్రం అందించారు.

పేదవాడి సొంతింటి కలను నిజం చేస్తాం

- దశలవారీగా ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ గృహాలు
- ఖేడ్ ఎమ్మెల్యే పి. సంజీవరెడ్డి


బీబీపేట్‌లో లబ్ధిదారునికి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


జహీరాబాద్‌లో లబ్ధిదారులకు మంజూరీ పత్రాలను అందజేస్తున్న డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి

కల్హేర్/నారాయణఖేడ్/పెద్దశంకరంపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతీ పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే తమ లక్ష్యమని, దీన్ని దశలవారీగా పూర్తి చేస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి అన్నారు. కల్హేర్ మండల పరిధిలోని మెట్టుకుంట, పోమ్యానాయక్, కొత్వరితండాలు, కల్హేర్, మార్డి, ఫత్తేపూర్, బీబీపేట్ గ్రామాల్లో బుధవారం ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం మార్డి గ్రామంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. ఇందిరమ్మ గృహాలను ప్రతీ పేదవాడికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో ఇల్లు లేని వారికే ప్రాధాన్యముంటుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ, నల్లవాగు కాలువల ఆధునీకరణ పేరిట కోట్ల రూపాయలు కాజేశారని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆరోపించారు. ఈ కార్యక్రమాల్లో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గుండు నరేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచయ్య, నాయకులు వీరశెట్టి, దేవదాస్, తుకారాం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే నారాయణఖేడ్ పట్టణంలోని మత్తడి పోచమ్మ ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అర్చకులు మోహన్‌జ్యోషి ఆధ్వర్యంలో అఘోర హోమం, పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, కాలనీవాసులతో పాటు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. గిరిజనుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ఖేడ్ శివార్లలోని రాంరావుమహరాజ్ ట్రస్టు స్థలంలో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్, దేవిదాస్‌మహరాజ్‌తో కలిసి ఆర్థిక సహాయాన్ని గిరిజన పూజారులకు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమాధికారి అఖిలేష్‌రెడ్డి, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్, కాంగ్రెస్ నాయకులు వినోద్‌పాటిల్, గిరిజన నాయకులు చరణ్‌సింగ్, పరశురాం, నారాయణనాయక్ పాల్గొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు విధి నిర్వహణలో చేసిన సేవలు ఎంతో గుర్తింపునిస్తాయని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మెదక్ జిల్లావిద్యాధికారి రాధాకిషన్ అన్నారు. పెద్దశంకరంపేటలో బుధవారం నిర్వహించిన పేట బాలికల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రప్రకాష్ ఉద్యోగ విరమణ సభలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, జిల్లా సైన్స్ అధికారి పోమ్యానాయక్, నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే కంగ్టి మండల పరిధిలోని రాంతీర్థ్, ఎన్కెమూరి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, ఎమ్మార్వో భాస్కర్, ప్రత్యేక అధికారి నూతన్‌కుమార్, సంజీవ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

జహీరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మొగుడంపల్లి మండలంలోని మాడ్గి, తదితర గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరీ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ముబిన్, నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, హర్షద్‌పాటిల్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే ఉపేక్షించం

- జడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న


కంది ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న

కంది, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు సమయపాలన పాటించకుంటే ఉపేక్షించేది లేదని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో ఆర్.స్వప్న అన్నారు. బుధవారం కందిలోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, అన్ని గదులను పరిశీలించారు. అనంతరం అటెండెన్స్ రిజిష్టర్, మిగా రికార్డులను తనిఖీ చేసి మాట్లాడారు. ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులందరు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం కనపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బేగంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగి గురుపాదం జాతీయ జెండాను ఆవిష్కరించడం సరికాదన్నారు. మరోసారి ఇలాంటి తప్పులు జరిగితే ఊరుకునేదిలేదని ఆమె స్పష్టం చేశారు. ఆమె వెంట కార్యాలయ సూపరింటెండెంట్ వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్లు బుచ్చయ్య, శ్రీకాంత్, సిబ్బంది అంజలి తదితరులు ఉన్నారు.

కార్మికుల నిధులు స్వాహా చేసిన అక్రమార్కులను శిక్షించాలి

- కన్‌స్ట్రక్షన్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి


సంగారెడ్డిలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల నిధులు స్వాహా చేసిన అక్రమార్కులను శిక్షించాలని కన్‌స్ట్రక్షన్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో బుధవారం కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన నిధులను కార్మికశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుంచి 500 కోట్లు దోపిడీ చేసిన అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని, బీఎంఎస్ తరఫున న్యాయపోరాటం చేసి కార్మికులను న్యాయం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు నర్సింలు, ఈశ్వర్‌గౌడ్, సామిల్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పెరట్లో మొక్కల పెంపకానికి ప్రోత్సాహం


పెరట్లో మొక్కలు పెంచిన దంపతులను సత్కరిస్తున్న కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

ఐడీఏబొల్లారం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ ఎరువులతో పెరట్లో మొక్కలు పెంచుతున్న వారిని ప్రోత్సహిస్తున్నామని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఐడీఏబొల్లారం మున్సిపల్ పరిధి చర్చిబస్తీలో సేంద్రియ ఎరువులతో పెరట్లో కూరగాయలు సాగుచేస్తున్న కవిత, సత్తిరెడ్డిలను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రతగా ఉంచడానికి సామాజికంగా ప్రతి ఒక్కరు సహకారం అందించాలన్నారు. అన్ని ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు . పట్టణం అంతటికి పరిశుభ్రతపై అవగాహన కలిగించడానికి ప్రహరీలపై పెయింటింగ్‌లు రాయిస్తున్నామని తెలిపారు. బహిరంగంగా వ్యర్థాలు పారబోయకుండా జరిమానాలు విధిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వో నర్సింహులు, మేనేజర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాండ్ మాస్టర్ సాజిద్‌కు అరుదైన గౌరవం


సాజిద్‌ను సన్మానిస్తున్న థమ్మాండో కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమి నిర్వాహకులు

సంగారెడ్డి రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డికి చెందిన బ్రూస్‌లీ కుంగ్ ఫూ గ్రాండ్ మాస్టర్ ఎండీ.సాజిద్‌కు థమ్మాండో కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమి నిర్వాహకులు విశిష్టమైన జ్ఞాపికను అందజేసి అరుదైన గౌరవమిచ్చారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే టోర్నమెంట్‌లో సాజిద్ మాస్టర్ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు పాల్గొని ఆరు బంగారు, ఐదు వెండి, ఐదు కాంస్య పతకాలు సాధించి రికార్డు సాధించారు. టోర్నమెంట్‌లో అత్యధిక పతకాలు సాధించినందుకుగాను ఎండీ.సాజిద్‌ను థమ్మాండో కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమి గ్రాండ్ మాస్టర్ అబ్దుల్ బాఖీ ఘనంగా సన్మానించారు.

పేదల వైద్యానికి ప్రభుత్వం చేయూత

- పీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి


బాధిత కుటుంబానికి ఎల్‌వోసీని అందిస్తున్న రాజిరెడ్డి

నర్సాపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పేదల వైద్యానికి ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా చేయూతనందిస్తున్నదని పీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. శివ్వంపేట మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన బొగ్గుల యశోద అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నది. అందుకు అవసరమైన రూ.2.50 లక్షల సీఎం సహాయనిధికి సంబంధించిన ఎల్‌వోసీని బుధవారం నర్సాపూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో రాజిరెడ్డి అందజేశారు. మాజీ సర్పంచ్ నవీన్‌గుప్తా, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు హరీష్‌వర్ధన్ పాల్గొన్నారు.

అట్టహాసంగా లలితాంబికాదేవి విగ్రహ శోభాయాత్ర


వారీకార్ భక్తులతో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

నారాయణఖేడ్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట నుంచి బుధవారం సాయంత్రం లలితాంబిక దేవి విగ్రహంతో శోభాయాత్రను అట్టహాసంగా నిర్వహించారు. ఏకాంబ నుంచి వారీకార్ బాల భక్తులతో కీర్తనాలు చేయిస్తూ పట్టణ శివార్లలోని మనూరు క్రాస్ రోడ్ వద్ద నిర్మించిన లలితాంబిక దేవి ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగింది.

ధర్మారంలో ఉచిత మెగా వైద్య శిబిరం


రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రామాయంపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని డిధర్మారంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సూరారం మల్లారెడ్డి ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 286 మంది రోగులు చికిత్సలు చేయించుకున్నారు. ఆస్పత్రి మార్కెటింగ్ ఇన్‌చార్జి రవిశంకర్, హరికృష్ణ నిర్వహణలో కొనసాగిన శిబిరంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మాసాయిపేట మల్లేశం, మాజీ ఎంపీటీసీ సిద్ధిరాంరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పొడేళ్ల లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి భూభారతి సదస్సులు

- మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్


చేగుంట: వల్లభాపూర్ భూభారతి రెవెన్యూ సదస్సులో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్


నిజాంపేట: భూ భారతి దరఖాస్తును పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి

చేగుంట/మాసాయిపేట/నిజాంపేట/తూప్రాన్/నర్సాపూర్/సంగారెడ్డి రూరల్/వెల్దుర్తి/ జహీరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయిలో భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులను ప్రతీ గ్రామంలో నిర్వహిస్తుందని మెదక్ జిల్లా అదన కలెక్టర్ మెంచు నగేష్ పేర్కొన్నారు. చేగుంట మండలం పరిధిలోని వల్లభాపూర్‌లో రెండో రోజు రెవెన్యూ సదస్సును సందర్శించారు. వల్లభాపూర్‌లో 32 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, ఆర్‌ఐలు సంతోష్, జైభారత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మాసాయిపేట మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు అదనపు కలెక్టర్ నగేష్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్ఞానజ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ వసంత, ఆర్ఐ నగేష్, గ్రామ కార్యదర్శి ప్రభురెడ్డి పాల్గొన్నారు. నిజాంపేట మండల పరిధి నందిగామలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆర్డీవో రమాదేవి బుధవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రమ్యశ్రీ, ఆర్‌ఐలు పాల్గొన్నారు. తూప్రాన్ మండలం వట్టూరు, పడాలపల్లిలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ఆర్డీవో జయచంద్రారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఇందులో తహసీల్దార్ టేక్మాల్ శ్రీనివాస్, లక్ష్మణ్‌రావు, నవీన్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. నర్సాపూర్ మండలం నారాయణపూర్‌లో డిప్యూటీ తహసీల్దార్ మహేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సంగారెడ్డి మండలం ఇరిగిపల్లి గ్రామంలో తహసీల్దార్ జయరామ్ రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వెల్దుర్తి మండల పరిధిలోని మంగళపర్తి, మేల్లూరు గ్రామాల్లో తహసీల్దార్ బాలలక్ష్మి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మంగళపర్తిలో 35, మేల్లూరులో 42 దరఖాస్తులు వచ్చాయని ఆమె తెలిపారు. జహీరాబాద్ మండలంలోని బూచనెల్లి, ఆనెగుంట తదితర గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. బూచనెల్లి-22, ఆనెగుంట-4 చొప్పున ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు.

సంగారెడ్డికి సారీ

5వ పేజీ తరువాయి

జనాభా నివసిస్తున్నది. ఇక్కడే స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. చిన్నపాటి కాలనీలు సైతం పట్టణాలను తలపిస్తున్నాయి. ప్రస్తుతం 1.50 లక్షల దాకా ఓటర్లు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఒక్కో వార్డుకు 3 వేల ఓటర్లను విభజించినా కనీసం 50 వార్డులైనా ఉండాలనే అభిప్రాయాలు నెలకొన్నాయి.

ఈ గ్రామాలు ఇక మున్సిపాలిటీలు

జిల్లాలో ఇప్పటికే సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట, ఐడీఏ బొల్లారం, అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. తాజాగా కోహీర్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్ మేజర్ గ్రామాలను మున్సిపాలిటీలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక్కడ పంచాయతీ ఎన్నికలకు బదులు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆ దిశగా అడుగులు వేగంగా పడ్డాయి. తాజా నోటిఫికేషన్‌లోనూ ఈ మున్సిపాలిటీల గురించి ప్రస్తావించారు. కోహీర్‌లో 16 వార్డులు, గుమ్మడిదలలో 22 వార్డులు, గడ్డపోతారంలో 16, ఇస్నాపూర్‌లోనూ 22 వార్డులను విభజించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. జూన్ 21వ తేదీ వరకు ఈ ప్రక్రియ పూర్తయితే సంగారెడ్డి జిల్లాలో మున్సిపాలిటీల సంఖ్య 12కు చేరుతుంది.

ఆస్పత్రుల్లో డైట్ నిర్వహణ.. ఇక మహిళా సంఘాలకే !

5వ పేజీ తరువాయి

సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఉండగా, టీవీవీపీ పరిధిలో జిల్లా వ్యాప్తంగా నాలుగు ఏరియా ఆస్పత్రులు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఇప్పటికే ఆయా ఆస్పత్రుల్లో డైట్ టెండర్ల గడువు దగ్గరపడింది. ఈ నెలాఖరు వరకు ప్రక్రియ పూర్తి చేసి జూలై నుంచి పూర్తి స్థాయిలో మహిళా సంఘాలకు అప్పగించాలనే యోచనలో సర్కారు ఉన్నది.

కలెక్టర్‌కు సూపరింటెండెంట్లు నోట్

జిల్లాలోని అన్ని సర్కారు ఆస్పత్రుల్లో డైట్ నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించాలని ప్రభుత్వం ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగానే అన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్లు కూడా తమ ఆస్పత్రి డైట్ నిర్వహణను మహిళా సంఘాలకు కేటాయించాలని కోరుతూ కలెక్టర్‌కు నోట్ ఫైలు పంపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సమాఖ్యల ద్వారా ఆయా ఆస్పత్రుల్లో డైట్ నిర్వహణ బాధ్యతలను త్వరలో మహిళా సంఘాలకు కేటాయించనున్నారు. దీంతో ఇక నుంచి టెండర్లు దాఖలు, కాంట్రాక్టర్ల వ్యవస్థ ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. ఇలా ఉంటే నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు ఏ ప్రాతిపదికన కేటాయిస్తారు, ఎన్నేళ్ల అగ్రిమెంట్ ఇస్తారు అన్న దానిపై స్పష్టత లేదు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉన్నాయని అధికారులు తెలిపారు. కాగా ఆస్పత్రుల్లో రోగులకు అందించే ఆహారం విషయంలో మహిళా సంఘాలతో సాధ్యమౌతుందా అన్న ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి.

హరీశ్‌రావుకు డా.శ్రీహరి శుభాకాంక్షలు


హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న డా.శ్రీహరి

సంగారెడ్డి అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు జన్మదినోత్సవం సందర్భంగా సంగారెడ్డికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డా.శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట యువ నాయకులు శ్రీకాంత్ ఉన్నారు.

'పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి'

నారాయణఖేడ్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచి, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ కోరారు. బుధవారం వందరోజుల కార్యాచరణల్లో భాగంగా 3వ వార్డులో తడి, పొడి చెత్తతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పరిశుభ్రతకు అధిక ప్రాధానం ఇస్తుందన్నారు. అనంతరం కాలనీల్లో ఉన్న ముళ్లపొదలను, మురుగు కాల్వలను శుభ్రం చేయించారు.

మేలైన రకాలను సాగు చేయాలి


మల్కాపూర్‌లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం

తూప్రాన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు వరి పంటల సాగులో అధిక దిగుబడిని ఇచ్చే మేలైన వంగడాలను వినియోగించుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు భారతీరాజా, గురుప్రసన్న, డాక్టర్ పాపారావు సూచించారు. బుధవారం తూప్రాన్ మండలం మల్కాపూర్‌లో బుధవారం ఏవో గంగమల్లు ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వరి వంగడాలలో కేఎన్‌ఎం 1638, ఆర్‌ఎన్‌ఆర్ 31479, జేజీఎల్ 24423, ఎన్‌ఎస్‌ఎం 118 మేలైనవని వివరించారు. వరిపంటలను నష్ట పరిచే కాండం తొలుచు పురుగు, సుడిదోమ, గింజ మచ్చ తెగులు నివారణకు యాజమాన్య పద్ధతులు వివరించారు. రసాయన ఎరువులతో పాటు, పచ్చిరొట్ట పంటలైన జీలుగు, జనుము, జీవన ఎరువులైన పీఎస్‌బీ వాడుతూ అధిక దిగుబడి పొందవచ్చని వివరించారు. మట్టి పరీక్షలతో కలిగే లాభాలు, ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయం, జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో సింధు పాల్గొన్నారు.

30 రోజుల పైలెట్ ప్రాజెక్టులో 1,045 సమస్యలను పరిష్కరించాం: తహసీల్దార్

కొండాపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం కింద కొండాపూర్ మండలంలోని 23 రెవెన్యూ పైలెట్ ప్రాజెక్ట్ గ్రామాలు ఎంపికైనది తెలిసినదే. మే 5 నుంచి 19వరకు 12 రోజులపాటు నిర్వహించిన గ్రామ సదస్సులో రెవెన్యూ బృందాలు 1,718 దరఖాస్తులను స్వీకరించాయి. దరఖాస్తులను 30 రోజుల గడువులోపు క్షేత్రస్థాయి పర్యవేక్షణ, భూరికార్డుల ఆధారంగా భూభారతి చట్టాన్ని అనుసరించి అధికారులు 1,045 సమస్యలను కొలిక్కి తీసుకొచ్చారు. ఎన్నోఏళ్లుగా పెడింగ్‌లో ఉన్న భూ సమస్యలను సైతం పరిష్కరించాలని అర్జీదారుల నుంచి అభ్యర్థనలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు.

'గో సంరక్షణ చట్టాన్ని అమలు చేయాలి'

వెల్దుర్తి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : గో సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు చందు అన్నారు. బుధవారం వెల్దుర్తి ఎస్ఐ రాజుకు వినతిపత్రం అందజేశారు. గోవుల రవాణాను అరికట్టాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐని కోరారు.